# బహుకృతవేషం

ఆఫీసు కాగితాలేవైనా వుంటే అవి మనం కదిలిస్తేగాని కదలవు. ఈ దేశంలో రెండు వేల రూపాయల జీతగాడివద్దనుంచి రెండువందల వాడివరకు ప్రతివాడికీ అసంతృప్తే. "అంతేకాక ఎక్కడ చూసినా అవినీతి, అక్రమార్జన తాండవమాడిపోతున్నాయి. మనం వొక్కరం నీతిగానూ, నియమంతోనూ వున్నంత మాత్రాన ఏం ప్రయోజనంలేదు" అన్నది బియ్యంలో రాళ్ళంత సహజంగా, తరతరాల భేదంలేకుండా ప్రతి ఉద్యోగి నోటివెంట వొక నినాదమైపోయింది. ఇతరుల కళ్ళలోని దూలాలు అవలీలగాపసిగట్టగలరుకానీ, తమకంట్లోని నలుసులేరుకోలేరు. ఏంలాభం ? ఈ వ్యవస్థ బాగుపడేది లేదు అన్న నిస్పృహ, మించిపోయిన పరిస్థితులన్నదిగులు కొందరు వ్యక్తం చేస్తున్నారు.

రాజధానిలో కాగితాలు కదిలించాల్సి వచ్చాను. ఐదేళ్ళయింది మళ్ళీ హైదరాబాదువచ్చి. అందువలన యీసారి నాలుగురోజులు వుండేట్లు

గానే వచ్చాను, యూనివర్శిటీలో, మా బావమరిది సుందరం ఎమ్. ఏ చదువుతున్నాడు. నేను హాస్టల్లో అతడి రూములో దిగితే, అతడి స్వేఛ్ఛకు కొంత ఆటంకం కలగవచ్చునని అక్కడ దిగకుండా దూరపు బంధువులింట దిగాను,

నేను హైదరాబాదులోనే ఏమ్. ఏ. చదువుకున్న తరువాత, గవర్న మెంటు ఉద్యోగంలో చేరిపోయాను. మధ్య వొక్కపూట ఎప్పుడో వచ్చి పోయానుగానీ, యీ ఐదేళ్ళలో హైదరాబాదు విశేషాలు అట్టే తెలీవు, నాపంల్లిలో రైలు దిగగానే స్టోర్ రూమ్‌లో సూట్ కేస్ పడేసి ఆఫీసుకే నేరుగా వెళ్ళాను. సరేబ్రహ్మప్రళయంమీద నా కాయితాలు రేపో ఎల్లుండో కదుల్తాయన్న వాగ్దానం, చేయించుకొని సాయంకాలం, బంధువులింటికి వెళ్ళాను.

మర్రోజు ఆదివారం కనుక పొద్దుటే బయలుదేరి 'క్రే' హాస్టల్‌వేపు వెళ్ళాను, అదృష్టవశాత్తూ మా బావమరిది సుందరం రూములోనేవున్నాడు నన్నుచూడగానే సహజంగా చాలా ఆనందాన్నే వ్యక్తపరిచాడు. ఎమ్. ఏ. ఫైనల్ చదువుతున్నాడు సుందరం.

'ఏమోయ్, ఎలాచదువుతున్నావు. తిండితిప్పలేలాగుంటున్నాయి, ఆరోగ్యం సరిగావుంది కదా" మొదలైన కుశలప్రశ్నలతో, ఈ వొక్క సంవత్సరం జాగ్రత్తగాచదివి. నేర్పుగా, వోర్పుగా, క్లాసుతెచ్చుకో వాల్సిన ఆవశ్యకతను ప్రస్తావించాను.

సుందరం ఎందుకో ఏ మాత్రమూ ఉత్సాహంగా లేడు. సుందరం చాలా మితభాషి. బహునెమ్మదస్తుడు. ఇంట్లో వాళ్ళంతా మేకదౌడలతని వని హాస్యంచేస్తూంటారుకూడా, నిమిషానికోమాట, అతినెమ్మదిగా కూడ బలుక్కుంటూ మాట్లాడడం, ప్రతి చిన్న విషయానికీ, ఏవేవో కల్పించు కుని బాధపడిపోవటం, సుందరం స్వభావంలో వొకభాగమని నాకూ

తెలుసు. పరీక్షలుకూడా సమీపిస్తుండటంవలన, రాత్రింబవళ్ళు కష్టపడి చదవటంవలన, మనస్సుకీ శరీరానికీ బాగా అలసట కలిగి అట్లా ఉన్నాడేమో ననుకున్నాను.

కాని సుందరం నెమ్మదిమీద వొక్కొక్క విషయం బయట పెట్టాడు. ఈ చదువుల కేమాత్రం సార్థక్యం లేదన్నాడు. ఈ చదువుల వల్ల సంస్కారం కొంచెంకూడా కలగకపోయిన తరువాత యీ చదువు లెందుకు అన్నాడు.

చెరువులోని నీళ్ళు ఏ కారణంవల్లనో కలుషితమై పోయిన తర్వాత, వొకమూల ఉప్పగా, వొకమూల చప్పగా, ఇంకొకమూల స్వాదువుగా రకరకాలుగా ఉండవు. సాంఘిక వ్యవస్థలోనే, మనుషుల మనస్సుల్లోనే, వొకరకమైన అలజడి, ఆందోళన, అసూయ, దౌర్జన్యం వచ్చేశాయి ఈ ప్రవృత్తి అంటుజాడ్యం లాంటిది. సుందరం బాధ పడిపోవటం ఎందుకో నా కర్థంకావటం లేదు. నాకు తెలిసిన డాక్టర్లూ, లాయర్లూ, టీచర్లు, గవర్నమెంటు ఉద్యోగులూ కొందరున్నారు. వాళ్ళను బాగా దగ్గరగా తెలుసుకుంటే అనేకమైన అపగుణాలూ, లోపాలూ కన్పించాయి. వీళ్ళందరూ ఎందుకిట్లా అయిపోయినారు- అని బాధ పడటంలో అర్థం ఏముంది? ఔచిత్యం ఎట్లావుంటుంది.

హాస్టల్లో వుంటున్న విద్యార్థుల్లో పార్టీలున్నాయిట. ఒకరిగూరి వొకరు, చాలా నీచంగా మాట్లాడుకుంటారట. మొన్న వొకసారి కొట్టుకుని, వొకడి తల పగిలితే హాస్పిటల్‌లో చేర్చవలసి వచ్చిందట. ఒకరిపై ఒకరికి చెప్పలేని అసూయట. ఓ కుర్రాడు శెలవులకని యింటికి వెడితే, అతడి గదితాళం పగలగొట్టి పక్కబట్టలూ, పుస్తకాలూ తగలబెట్టారట

ఇటీవల దొంగతనాలుకూడ ఎక్కువైనాయట. విలువైన పుస్తకాలూ, గడియారాలూ ఎత్తుకుపోవటం జరుగుతున్నదట.

ఇవన్నీ విన్నతరవాత నాకూడా బాధ కలిగినమాట నిజం. వీళ్ళంతా ఇక రెండు మూడేళ్ళలో ఏదో ఒక ఉద్యోగంలో చేరి, దేశ పరిస్థితుల్ని చక్కదిద్దవలసినవాళ్ళు. వీళ్ళే డాక్టరూ, లాయరూ, మంత్రులూ, వ్యాపారసంస్థల యజమానులూ, ప్రభుత్వ యంత్రాంగంలోని ఉద్యోగస్థులూ అవుతారు. వీళ్ళ ప్రవర్తన ఇట్లావుంటే కుళ్ళు కంపు కొడుతున్న, ఏదో చచ్చిపడివున్న జంతువు శరీరాన్ని రాబందులు పీక్కుతిన్నట్లుగా దేశాన్ని పీక్కుతినరా? రాబందులంటే జ్ఞాపకం వస్తున్నది, ఇవి రామబంధువులట, మరి ఎప్పుడు రాముడికి సాయంచేశాయో? లేదా, ఇప్పటి రాజకీయ నాయకులూ, మంత్రులూ, సత్యాహింసలకూ, సత్ప్రవర్తనకూ, నీతి నియమాలకూ తాము మాత్రమే ప్రతినిధులమని చెప్పుకోవటం లాంటిదేనేమో, రాబందులు రామబంధువులమని చెప్పుకోవటం. ఎక్కడో వో కథలో అవి అట్లా చెప్పుకున్నాయి.

సుందరం ఇంకా చాలా బాధపడిపోతూ ఎన్నో విషయాలు చెప్పాడు. నెలకు పన్నెండు వందలూ ఇంకా పైన అనేక సంభావనలూ, తీసుకునే ప్రొఫెసర్‌గా రాకాయన, డబ్బిచ్చుకుని మార్కులేస్తారట. సరే తాను దీనికొరకే బాధపడుతూ వుంటే, క్లాసులివ్వటం అనే దాంట్లోనూ, పక్షపాతం చూపుతారట కొందరు. ఈ కుర్రాళ్ళు కొందరు వెళ్ళి ఆ పెద్దల అభిమానం, అనుగ్రహం. సంపాదించుకుందామని తక్కిన కుర్రాళ్ళపైన చాడీలు చెపుతారట. వాళ్ళు మిగురించి ఇట్లా దుష్ప్రచారం చేస్తున్నారనీ, అవాకులూ చెవాకులూ పేలుతున్నారనీ, ఉన్నవీ లేనివీ, తమ స్వార్థంకొరకు, ఇతరులు చెడిపోవాలనీ, చెపుతూ

వుంటారుట. సుందరం పైన కూడా ఎన్నో అలాంటివి కల్పించి చెప్పారుట.

సుందరం ప్రొఫెసర్‌గారు ఎన్నదగిన మనిషి కాబట్టి, కోటి కొక్కరు గణింపవలసిన వ్యక్తి కాబట్టి, సుందరాన్ని పిలిచి ఇట్లా వాళ్ళు అంటున్నారు ఏమంటావు? అని అడిగారుట. సుందరం చాలా బాధపడి పోతున్నాడు. అందరూ అలాంటివాళ్ళు కాదు, అయినా క్లాసులో ఒక రిద్దరైనా వున్నారుగా. అలాంటివాళ్ళు ఎందుకుండాలి అసలు? అని సుందరం బాధ. ప్రొఫెసర్‌గారు మంచివారు. నిజమే. అయితే అసలా చెప్పుడు మాటలాయన ఎందుకు వినాలి? అంటే ఆయనగారి లోనూ ఏదో బలహీనత ఉన్నదన్నమాట. అప్రియమైనా భార్య మాటల్లో పిల్లల మాటల్లో వినేట్టుగా వింటారన్నమాట. ఆయన మంచివారు కాబట్టి సరిపోయింది. లేకుంటే, నిజమేనని నమ్మితే, అపకారం చేయవలెనను కుంటే జరిగేది కదా– అని సుందరం బాధ.

చదువుకునే కుర్రవాళ్ళు దొంగతనా లెందుకు చెయ్యాలి?

ఎందుకు త్రాగాలి?

ఎందుకు కాపీలుచెయ్యాలి?

ఒకరిపై వొకరికీ అసూయలూ, ద్వేషాలూ ఎందుకు?

పది రోజులక్రితం, టేబిల్‌మీద పెట్టి, బాత్‌రూమ్‌లోకి వెళ్ళివచ్చే లోగా సుందరం గడియారం పోయిందట.

గడియారం విలువకోసం కాదుగానీ తనతో చదువుకునే సాటివా డెవడైనా తీసి వుంటాడా? అని అన్నం సయించక, నిద్రపట్టక నాలుగు

రోజులు బాధపడ్డాడుట సుందరం. మనసుకి చెప్పలేని అసహ్యమూ, ఏవగింపూ, ఆక్రోశమూ కలిగాయుట. లైబ్రరీనుంచి తెచ్చిన పుస్తకం ఒకటి పోయిందట. దానికి ఫైను చెల్లించాల్సి వచ్చిందట.

ఇవన్నీ వింటూవుంటే నాకూ చాలా బాధ కలిగింది.

నేనూ చూశాను, ఎం. ఎ. పరీక్ష పేపర్ ఆన్సర్ చేస్తున్నప్పుడు నా ముందు వరసలో వో కుర్రాడు డాబుగా కాపీ కొట్టటం, వాడు ఎలాగో క్లాస్ తెచ్చుకొని లెక్చరరై పోయి విద్యార్థులకు నీతిపాఠాలు చెప్పవచ్చును. డబ్బు తీసుకుని మార్కులు వేయవచ్చును. లేదా యీ దేశం గ్రహచారం బాగుండక, లాయరో, గొప్ప గవర్నమెంటు ఉద్యోగో అయితే ఇక చెప్పవలసిందేముంది? ఇంకా చెడ్డరోజులు దాపురించి మంత్రి అయినాడా లూటీలు, గృహదహనాలూ కూడా జరుగుతాయి, పెరుగుతాయి.

ఈ దేశమంతా ఇట్లా ఎందుకయిపోతున్నది? దుర్మార్గులు పెద్దలుగా ఎందుకు చెలామణీ అవుతున్నారు? అంటాడు సుందరం. ఈ ప్రశ్నలకు నేనుమాత్రం ఏం సమాధానం చెప్పగలను?

సుందరాన్ని ఏవేవో ఇతర విషయాలు చెప్పి నెమ్మదిగా ఓదార్చాను. ప్రపంచంలో ఎవరో అపమార్గాన పోతున్నారనీ, ఇలా ఎందుకు జరుగుతున్నదనీ బాధపడి ప్రయోజనంలేదు. వాళ్ళంతా ఇంతకన్నా పెద్ద పెద్ద తప్పుడు పనులే చేస్తున్నారు. కనుక, మనంకూడా చిన్న చిన్న తప్పుడు పనులు చెయ్యొచ్చుననీ, చెయ్యక గత్యంతరం లేదనీ, అనుకోవడం– సమర్థించుకోవడం చాలా తప్పు! మనం అంతరాత్మసాక్షిగా, సత్ప్రవర్తనతో వుండాలి, అలావుంటే కష్టాలూ, అసంతృప్తులూ కలిగినా, వాటిని అధిగమించగలుగుతాము, అని ఏవేవో చెప్పాను.

ఆవాళ మధ్యాహ్నం సుందరంతోనే భోజనం చేశాను.

సాయంకాలం డైరీఫారంలో బస్ ఎక్కి బర్కత్‌పురాలో యువతీ మండలి దగ్గర దిగాను.

మునిమాపు చీకట్లు ముసురుకుంటున్నాయి. లైట్లు వెలిగాయి.

యూనివర్శిటీలో క్లాసులు జరగటంలేదు. పరీక్షలకు సిద్ధమయ్యేందుకు సెలవులిచ్చారు. కనుక బస్ కూడా రద్దీగాలేదు.

బస్ స్టాప్‌లో దిగి చిక్కడపల్లి వెళదామని నడుస్తున్నాను.

నగరంలో వేసవికాలపు సాయంకాలాలు తమాషాగా వుంటాయి. చదువుకునే రోజుల్లో యీ వీధులన్నీ నేను బాగా తిరిగినవే.

ఇంతలో వెనకనుంచి నన్నెవరో, అత్యంతమూ ఆదరమూ, గౌరవమూ వుట్టిపడే స్వరంతో పిలిచారు. వెనుదిరిగి చూశాను. ఆయన్ని చూడగానే నాకు కుతూహలమూ, ఉత్సాహమూ కూడా కలిగాయి. ఆయన దగ్గరగావచ్చి "క్షమించండి" అన్నాడు ఇంగ్లీషులో. ఇంగ్లీషు బాగా ధారాళంగా మాట్లాడేవాళ్ళంటే, నిజం చెప్పాలంటే నాకు కొంచెం భయం. ఎందుకంటే వాళ్ళతో సాయిలా పాయిలాగా మాట్లాడలేకపోవటమో, లేక వాళ్ళు నాగరికతలోనూ, సంస్కారంలోనూ పై మెట్టున వున్నారన్న భావమో ఏదో వొకటై వుంటుంది. మనం తరచూ చూస్తుంటాము, బస్సుల్లో, రైళ్ళల్లో, వీధుల్లో, మనకు సరిగారాని భాషపట్ల మనకుండే భయభక్తులూ, గౌరవాదరాలూ. సంఘంలో వొక "స్టేటస్"కి లక్షణమై పోయిందీ పరాయిభాష. మనుషులు కలివిడిగా వుండలేక పోవటానికి

యీ పరాయి భాషకూడా కొంత దోహదం చేస్తూనేవున్నది. మనకు తెలిసినభాషతో తిట్టటంకన్నా, తెలీనిభాషలో విసుక్కున్నా, మనస్సుకి ఖేదమూ, ఉద్రేకమూ కలుగుతాయి. ఇవి నా వొక సిద్ధాంతంలోని కొన్ని అంశాలు.

సరే, ఆ పెద్దమనిషీ నేనూ, అడుగులేస్తూనే మాట్లాడుకుంటు న్నాము. ఆయనగారు చెపుతున్నారు. "వాళ్ళది నెల్లూరుట, మధ్యతరగతి కుటుంబం. నలుగురు పిల్లలు, ఆడపిల్లలకు పెళ్ళిచెయ్యాలి, మగపిల్లలకు చదువులు చెప్పించాలి, ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగంచేస్తూ వచ్చాడు. వాళ్ళు అకారణంగా, అన్యాయంగా తీసేశారు. ఇక్కడ ఇద్దరు ముగ్గురు పెద్దమనుషులు తనకు తెలుసును. ఒకాయనగారు గవర్నమెంటులో గొప్ప డైరక్టరు. తప్పక ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పాడు. వెళ్ళినప్పు డల్లా రేపురా, మాపురా అంటున్నాడు. ఇప్పటికి ఇక్కడికివచ్చి మూడు నెలలైంది. ఇంటిదగ్గరవాళ్ళు వెంటనే వచ్చేయమని ఉత్తరాలు రాస్తు న్నారు. ఇంకోరు, సెక్రటరీగాను, రేపు మాపు ఉద్యోగం ఇస్తామంటు న్నారు. ఇంకోరు, ఆ ప్రాంతంవారే ఛోటా రాజకీయ నాయకు డొక డున్నాడు. నాలుగు వందలు తెస్తే రేపే ఉద్యోగం వస్తుందంటున్నాడు. నాలుగు వందలు ఎక్కడ తెచ్చేది. చూశారా సార్. దేశం ఎలా తగల బడి పోతున్నదో! మట్టి కొట్టుకొని పోతున్నదో! ఇంత అన్యాయం ఎక్కడైనా వుందా? తెచ్చుకున్న రెండువందలూ అయిపోయినయ్. చేతి గడియారం అమ్మేశాను. నాలుగు రోజులుగా కాఫీమాత్రం తాగి వుంటు న్నాను. తెలిసిన బంధువులెవరో వొకరిద్దరున్నారుట. కాని తనకు తగని అభిమానం. వాళ్ళింటికి వెళ్ళటానికి మనస్కరించటంలేదు. పదీ రూపాయలు సర్దితే, తాను వెంటనే ఎమ్. వో. చేస్తాను ఇంటికివెళ్ళి అని చెప్పాడు తన కథను. సాయం అడిగాడు.

నేను మాట్లాడకపోవటం చూసి పోనీ భోజనం చేస్తాను రెండు రూపాయలైనా ఇవ్వమని నాపైన ఎంతో సానుభూతి చూపుతూ అడిగా డాయన.

నాకు చాలా నవ్వొచ్చింది.

నవ్వును ఆపుకోలేకపోయాను.

ఆ పెద్దమనిషి నావైపు అసహ్యంగానూ, కోపంగానూ చూశాడు.

"అయితే ఐదేళ్ళుగా మీ కథలో ఎటువంటి మార్పు రాలేదన్న మాట. అచ్చు తప్పులతోసహా అలానే వున్నదే. అయ్యా! ఐదేళ్ళ క్రితం, మిట్టమధ్యాహ్నం యూనివర్సిటీనుండి వస్తున్న నన్ను నిలేసి యీ కథంతా, ఇట్లానే తూ. చా. తప్పకుండా వినిపించారు. నేనీ కథంతా నిజమేననుకొని నాతో హోటల్‌కు రమ్మని మిమ్మల్ని ఆహ్వానించాను. కాని మీరు మొహమాటపడ్డారు. బాధపడుతూ నా దగ్గర వొక్కరూపాయి మాత్రమేవుంటే, అది మీ కిచ్చాను. మీ రిందాక నన్ను పిలిచినప్పుడే నాకు చాలా ఆసక్తి కలిగింది. వినోదంగావుండి, మళ్ళీ ఆ కథంతా విన్నాను" అన్నాను.

ఆ పెద్దమనిషి ముఖాన కత్తివాటుకు నెత్తురుచుక్క లేదు.

నన్ను శపిస్తున్నట్లుగా చూస్తూ పెద్దపెద్ద అంగలు వేసుకుంటూ వెళ్ళిపోయాడు.

నాకు నవ్వొచ్చింది.

ఆ పెద్దమనిషి పైన నాకేమాత్రమూ, కోపంగానీ, అసహ్యంగానీ లేవు. మనవాళ్ళు చెప్పనే చెప్పారు, ఉదరనిమిత్తమే బహుకృత వేషమని.

అయితే ప్రొఫెసర్లూ, డాక్టర్లూ పెద్దపెద్ద ఉద్యోగస్థులూ, వ్యాపారస్థులూ, గడ్డితింటూవుంటే- అవన్నీ వొకరిని వొకరు ఆదర్శంగా ఎంచుకుంటూ, అబద్ధాలాడి పోషించుకునే ఆ పెద్దమనిషిని ఏమని నేను తప్పుపడతాను.

దొంగతనాలు చేసే విద్యార్థులూ, మోసాలుచేసే రాజకీయ నాయకులూ, రౌడీలూ, దొంగలూ, తాగుబోతులూ, పెద్దమనుషుల వేషా — వీటన్నిటిముందూ, ఈ పెద్దమనిషివేషం ఏపాటిది ?

అయితే వొక్కటే సమస్య మిగిలిపోయింది. ఈ వేషాలన్నీ ఉదరనిమిత్తమైనవేనా ? అని.

అవి గనక ఉదరాలే అయితే వాళ్ళంతా తప్పక రాక్షసులు మాత్రమే అయివుండక తప్పదు.